నమస్తే తెలంగాణ
నల్లగొండ

## నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 16 : శ్రీశైలం నుంచి వరద కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 79,617 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అదే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగిస్తున్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా 32,400 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232, వరద కాల్వ ద్వారా 600, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగర్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

## హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

### మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 16 : ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను హామీల అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు చేస్తానన్న రేవంత్‌రెడ్డి 8 నెలలైనా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. దాదాపు 50 శాతం మంది రైతులకు వివిధ సాకులతో రుణమాఫీ చెయ్యలేదని ఆరోపించారు. వైరా సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అర్థం లేని ఆరోపణలు చేశారని, కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని, ఇప్పటికీ ఆయన అదే మాట మీద ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 32లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.17,900 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, అర్హులందరికీ ఎందుకు చెయ్యలేదో రేవంత్ చెప్పాలని ప్రశ్నించారు. మాటిమాటికీ బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెడ్తానని రేవంత్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరితోపాటు తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఎంపీ సీట్లు ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కార్పొరేటర్ స్థానం మాత్రమే గెలిచిందని, గతంలో హుజూరాబాద్, మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదని అన్నారు. ఇవన్నీ రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలేనని గుర్తు చేశారు. ఇప్పటికైనా మాయమాటలు చెప్పడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ షోయబ్, ఫయాజ్, వినోద్‌నాయక్, శివ ఉన్నారు.

# రుణమాఫీ సగమే..



## లక్షలాది మంది అర్హులు దూరం

- రేషన్ కార్డు లింక్‌తో ఎగనామం
- రేషన్ కార్డు లేనివాళ్ల మాఫీ పెండింగ్‌లోనే.
- ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలకే పరిమితం
- భారీగా తగ్గిన లబ్ధిదారుల సంఖ్య.
- బ్యాంకుల చుట్టూ రైతన్నల చక్కర్లు
- సహకార సొసైటీలకు చేరని తుది జాబితా
- రైతాంగం ఆశలపై రేవంత్ సర్కారు నీళ్లు
- వ్యవసాయాధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

పంటల సాగుకు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాటలు బూటకమేనని తేటతెల్లమవుతున్నది. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వ తీరు 'ఏరు దాటాక బోడి మల్లయ్య' అన్న చందాన్ని తలపిస్తున్నది. రుణమాఫీని లబ్ధిదారుల సంఖ్యను, వారి కోసం వెచ్చించాల్సిన డబ్బును ఎంత వీలైతే అంతగా కుదించేందుకు తీవ్ర కసరత్తులు చేస్తూ రుణమాఫీని అమలు చేశారు. లక్షలాది అర్హులైన రైతులకు మొండిచెయ్యి చూపుతూ మ.మ. అనిపించేశారు. ఫలితంగా ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా కనీసం రెండు లక్షల మంది రుణమాఫీ లబ్ధి నుంచి చేకూరనట్లు రైతు సంఘాల నేతలు చెప్పున్నారు. రైతు ప్రభుత్వమంటూ రైతులకు టోకరా పెట్టేందుకే కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తున్నట్లు తీవ్రంగా మండిపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం చివరి విడుత రుణమాఫీలో రెండు లక్షల వరకు అమలు చేస్తున్నట్లు ప్రకటించినా రైతుల వారీగా పూర్తి వివరాలు వెల్లడించ లేదు. సహకార సంఘాల లబ్ధిదారుల జాబితాలపైనా శుక్రవారం రాత్రి వరకు స్పష్టత రాలేదు.

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ)

ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐదు లక్షల మంది రైతుల వరకు లబ్ధిదారులుగా ఉంటారని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెడుతూ రేషన్ కార్డు ఆధారంగా కుటుంబాన్ని లెక్కలోకి తీసుకోవడం వల్ల దాదాపు రెండు లక్షల మంది రుణమాఫీకి దూరమయ్యారని స్పష్టమవుతున్నది. గతేడాది ఆగస్టులో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీ లెక్కలే ఇందుకు సాక్ష్యంగా తెరపైకి వస్తున్నాయి. 2018 ఎన్నికల హామీలో భాగంగా కేసీఆర్ ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీలో రూ.99,999వరకు అమలైంది. అప్పట్లో పాస్‌పుస్తకమే ప్రమాణికంగా రుణమాఫీ అమలు చేశారు. దాంతో భారీ మొత్తంలో రైతులకు రుణమాఫీ లబ్ధి చేకూరింది. కేసీఆర్ సర్కార్ హయాంలో లక్షకు ఒక్క రూపాయి తక్కువగా అంటే 99,999 వరకు రుణమాఫీని అమలు చేస్తేనే ఉమ్మడి జిల్లాలో 4,00,518 మంది రైతులకు మొత్తం రూ.2,159.77 కోట్ల రుణమాఫీ జరిగింది. కానీ ప్రస్తుతం రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేసినా మూడు విడతల్లో కలిపి లబ్ధి జరిగింది సగమే కావడం చర్చనీయాంశమైంది. మూడు విడతల్లో కలిపి 3.39 లక్షల మంది రైతులకే మేలు జరుగుతున్నది. కేసీఆర్ హయాంలో లక్ష లోపు రుణమాఫీ జరిగిన రైతుల సంఖ్య ప్రస్తుతం రెండు లక్షల రుణమాఫీ జరిగిన రైతుల సంఖ్య కంటే ఎక్కువ ఉండడం గమనార్హం. అప్పటితో పోలిస్తేనే 60 వేల మంది లబ్ధిదారులు తగ్గిపోయారు. గతంలో కంటే రెట్టింపు రైతులు ఉంటారని ప్రారంభంలో అంచనా వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుయుక్తులతో జాబితా సగానికి సగం తగ్గిపోయింది. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేస్తే పెద్ద ఎత్తున నిధులు సమకూర్చుకోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెట్టింది. రేషన్ కార్డు ప్రామాణికంగా కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ వర్తించేలా కట్టుదిట్టంగా వ్యవహరించింది. రేషన్ కార్డులో ఎంత మంది ఉన్నా ఒక కుటుంబంలో గరిష్ఠంగా రూ.2లక్షల రుణమాఫీ మించవద్దని ఆదేశాలిచ్చింది. రేషన్‌కార్డు లేని వారిని మొత్తానికే పక్కన పెట్టింది. దీనికి తోడు ఆధార్ సీడింగ్ లేదా ఇతర సాంకేతిక పరమైన సమస్యలు ఉన్న వారికి సైతం రుణమాఫీ కాలేదు. వారందరికీ ఎప్పుడు చేస్తారన్న దానికి ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికీ స్పష్టత లేదు.

### చివరి విడుత జాబితాలేవి?

పంద్రాగస్టు సందర్భంగా చివరి విడుత రుణమాఫీని ప్రభుత్వం ప్రారంభించింది. ఆ జాబితాలు శుక్రవారం సాయంత్రానికి కూడా అడ్రెస్ లేవు. కేవలం జిల్లాల వారీగా రైతుల సంఖ్య, రుణమాఫీ మొత్తం లెక్కలు మాత్రం అధికారికంగా ప్రకటించారు. కానీ బ్యాంకుల వారీగా, సొసైటీల వారీగా రైతుల సంఖ్య, జాబితాలపై స్పష్టత రాలేదు. రైతులు శుక్రవారం తమ పంట రుణాలు ఉన్న బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కనిపించారు. తమకు స్పష్టత రాలేదని బ్యాంకర్లు చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. సహకార సొసైటీలకు కూడా రైతుల జాబితా చేరలేదు. సోమవారం వరకు స్పష్టత రావచ్చని అధికారులు చెప్తున్నారు.

### రుణమాఫీలో తేడాలు

| | ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో (రూ.2లక్షల వరకు) | | బీఆర్‌ఎస్ హయాంలో (రూ.99,999వరకు) | |
|---|---|---|---|---|
| జిల్లా | రైతులసంఖ్య | రుణమాఫీ(కోట్లలో) | రైతులసంఖ్య | డబ్బు (కోట్లల్లో). |
| నల్లగొండ | 1,71,788 | 1421.35 | 1,65,300 | 1044.02. |
| సూర్యాపేట | 1,00,376 | 745.00 | 1,75,492 | 751.00 |
| యాదాద్రిభువనగిరి | 67,485 | 528.57 | 59,726 | 364.75 |
| మొత్తం | 3,39,649 | 2,694.92 | 4,00,518 | 2,159.77 |

### రేషన్ కార్డు లేని వారి సంగతేంటి?

పదేండ్లకు పైగా కొత్త రేషన్‌కార్డుల జారీ లేకపోవడంతో చాలామంది యువ రైతులకు రేషన్ కార్డు లేదు. కాంగ్రెస్ సర్కార్ పెట్టిన రేషన్ కార్డు ప్రమాణికం షరతు వల్ల వేలాది మందికి ఇప్పుడు రుణమాఫీ వర్తించడం లేదు. వారంతా ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రేషన్‌కార్డు లేని రైతులను గ్రామాల వారీగా సభలు పెట్టి అర్హులను గుర్తిస్తామని ప్రారంభంలో ప్రభుత్వం చెప్పినా అందుకు సంబంధించి కార్యచరణేదీ చివరి విడుత అనంతరం కూడా లేదు. దాంతో రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీపై నీలినీడలు అలుముకున్నాయి. సాంకేతికంగా బ్యాంకు అకౌంట్‌తో ఆధార్ సీడింగ్ వంటి సమస్యలు తలెత్తిన రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. వీరి పరిస్థితి ఏంటన్నది కూడా తేలాల్సి ఉంది. ఇక అన్ని అర్హతలు ఉండి కూడా రుణమాఫీ కాని రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇలా ఎన్నో సందేహాలు రుణమాఫీ కాని రైతుల్లో నెలకొన్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## రైతుల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ పార్టీనే

- హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : తెలంగాణ రైతుల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ పార్టీనే అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థ పాలన కాంగ్రెస్‌ది అన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని, కానీ.. ఆరు గ్యారెంటీలు, ఏక కాలంలో రుణమాఫీ చేయకుండా రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఖమ్మం జిల్లా బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరును చూసి ప్రజలు, మేధావులు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామని ఆలోచిస్తున్నన్నారని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రైతులందరికీ రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ.9 వేల కోట్లు కోత పెట్టడం సరికాదన్నారు. స్పష్టత లేని రుణమాఫీపై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వంపై తిరుగబడేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏక కాలంలోనే రుణ మాఫీ జరుగుతుందని సోనియా చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, ఏకకాలంలో రుణ మాఫీ అమలులో విఫలమైన రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు యానాల అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీధర్, ఉపేందర్ పాల్గొన్నారు.

## వరలక్ష్మి నమోస్తుతే..



నల్లగొండ పాత బస్తీ సంతోషిమాత ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

రామగిరి, ఆగస్టు 15 : శ్రావణమాసంలో రాఖీ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. ఆలయాలతోపాటు గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిపాటలతో లక్ష్మి అమ్మవారిని కొలిచారు. కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

## సాగర్ నీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

### కోమటికుంటలో రాస్తారోకో



పాలకవీడు మండలం కోమటికుంటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

పాలకవీడు, ఆగస్టు16 : సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు వదిలి పెట్టి రెండు వారాలైనా తమ పొలాలకు నీరు అందడం లేదని, ఊరి చెరువుకు చుక్క నీరు కూడా చేరలేదని రైతులు ఆందోళనకు దిగారు. ఎన్‌ఎస్‌పీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందంటూ మండలంలోని కోమటికుంట గ్రామ చెందిన రైతులు జాన్‌పహాడ్–నేరేడుచర్ల రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాగర్ నీళ్లు అందక సాగు పనులు మొదలు పెట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు కూడా తగ్గిపోవడంతో బోర్లు పోయడం లేదని పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం మండిపడ్డారు. గతంలో సాగర్ నీరు వదిలితే జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో మైనర్ కాల్వ ద్వారా చెరువులో నీరు చేరేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నెస్పీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కాల్వకు ముందున్న రైతులు ఎక్కడిక్కడ గండ్లు పెట్టి పొలాల్లోకి నీటిని పారిస్తుండడంతో చివరి భూముల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తూములను కట్టి తొలుత చివరి భూములకు నీరు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ కాల్వలపై అధికారులు పర్యవేక్షణ ఉంచి చివరి భూములకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆర్టీసీ కార్గోలో రాఖీ

నల్లగొండ సిటీ, ఆగస్టు 16 : దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లలేని అక్కాచెల్లెళ్లకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఆర్టీసీ కార్గో ద్వారా ప్రత్యేకంగా రాఖీలు, స్వీటు బాక్సులను పంపించే సదుపాయం కల్పించింది. అనుబంధం, ఆప్యాయత పంచుకునేందుకు ఆర్టీసీ కల్పించిన అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 7 డిపోల పరిధిలో అన్ని కార్గో కేంద్రాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

సూర్యాపేటకు సంబంధించిన వివరాలకు 9154298695, 9618038372 నంబర్లలో సంప్రదించాలని సూర్యాపేట డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జానీపాషా తెలిపారు.

## జ్వర సర్వే ప్రారంభం

**తొలిరోజు 60,490 ఇండ్లకు వెళ్లిన 1,466 బృందాలు**



పెద్దఅడిశర్లపల్లిలో జ్వర సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి

- 769 మందికి ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తింపు
- పరీక్షల కోసం శాంపిల్స్ సేకరణ

నీలగిరి, ఆగస్టు 16 : సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే రెండు దఫాలుగా ఇంటింటి జ్వర సర్వే నిర్వహించిన వైద్యారోగ్య శాఖ శుక్రవారం మూడోసారి కూడా ప్రారంభించింది. వెయ్యి ఇండ్లకు ఒకటి చొప్పున జిల్లావ్యాప్తంగా 1,485 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 8 మున్సిపాలిటీల పరిధిలో 182 బృందాలు, 848 గ్రామ పంచాయతీల్లో 1,303 బృందాలు పనిచేయనున్నాయి. ఈ బృందంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్, పంచాయతీ అధికారులు ఉంటారు. తొలిరోజు 1,466 బృందాలు 60,490 గృహాల్లోని 2,21,785 మందికి సంబంధించిన ఆరోగ్య వివరాలు సేకరించారు. అందులో 769 మంది ప్రాథమిక లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి స్టెరాయిడ్స్‌ను అందించారు. 259 మందికి డెంగ్యూ లక్షణాలు ఉండడంతో శాంపిల్స్‌ను తీసుకున్నారు. మరో 83 మందికి ఇతర వ్యాధి లక్షణాలు ఉండడంతో వారి నుంచి కూడా శాంపిల్స్ సేకరించారు. వీరి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షించనున్నారు. రెండుమూడ్రోజుల్లో జ్వరం తీవ్రత తగ్గకుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు పంపించి పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు ఉంటే మందులు అందించి మూడు రోజుల పాటు పర్యవేక్షిస్తారు.

## చేజ్ చేసి గంజాయి సీజ్!

- కిలోమీటర్ల కొద్దీ వాహనాల్లో వెంబడించి..
- సినీ ఫక్కీలో నిందితుల పట్టివేత



కారులో నుంచి గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

చౌటుప్పల్ రూరల్/పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 16: అది రద్దీగా ఉండే విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి. శుక్రవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటలు కావస్తున్నది. పంతంగి టోల్‌గేట్ వైపు నుంచి మితిమీరిన వేగంతో కారు దూసుకొస్తున్నది. అప్పటికే వచ్చిన సమాచారంతో హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లను చూసి హైవేపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మా ర్గంలోకి రాంగ్‌రూట్‌లోకి కారును పోనిచ్చారు. ఇంకేముంది.. మళ్లీ చేజ్.. ఆ ముందుకురాగానే కారును హైవేకు ఆనుకుని ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వైపు మళ్లించారు. పోలీసు వాహనాలు ఆ కారును వెంబడించాయి. చివరకు తప్పించుకునే క్రమంలో కారు వేగంగా స్తంభా న్ని ఢీకొట్టింది.. అందులోని నలుగురిని పోలీసులు పట్టుకున్నారు.. ఇదంతా క్రైమ్ సిరీస్‌లలో ని ఎపిసోడ్‌లా జరిగిపోయింది. తేరుకునేలోపే మళ్లీ పోలీసు వాహనాలన్నీ వెళ్లిపోయాయి..

శుక్రవారం ఖమ్మ, భద్రాచలం ప్రాంతాల నుంచి నలుగురు నిందితులు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో నల్లగొండ టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో నిందితులను వెంబడించారు. విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌గేట్ దగ్గర ఎర్టిగా కారులో వస్తున్న నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ, నిందితులు టోల్‌గేట్ దగ్గర వాహనాన్ని ఆపకుండా, గేట్‌ను ఢీకొట్టి తప్పించుకున్నారు. అధికారులు వెంటనే హయత్‌నగర్ ఎక్సైజ్‌తోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో హైవేకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, బారికేడ్లను గుర్తించిన నిందితులు కారును రాంగ్‌రూట్‌లోకి మళ్లించారు. హైవేపై దాదాపు 500 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళ్లి ఆ తర్వాత జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వైపు మళ్లారు. అటునుంచి బయటకు వెళ్లిపోవచ్చని భావించారు. కానీ, కాలనీకి ప్రవేశమార్గం, తిరిగి వెళ్లేమార్గం ఒకటేననే విషయం వారికి తెలియదు. కారు దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో కాలనీలోకి వీధుల్లో చక్కర్లు కొట్టింది. కాలనీ వాసులు కొద్దిసేపు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటికే కాలనీ ప్రవేశమార్గం వద్ద పోలీసులు తమ వాహనాలతో మోహరించారు. అతివేగంలో కారును వెనక్కి తిప్పే క్రమంలో నిందితులు స్తంభాన్ని ఢీకొట్టారు. జాతీయ రహదారిపై మొబైల్ వెహికల్ కానిస్టేబుల్ వారిని పట్టుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. ఆ వెంటనే పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కారులోని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నల్లగొండ జిల్లాకు తరలించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.




